క్లుప్తంగా

కష్టపడి చదివితేనే భవిష్యత్తు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుంటాల: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కుంటాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ పేర్కొన్నారు. బాసర ట్రిపుల్ ఐటీకి ఆదర్శ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు ఎంపికవగా.. శుక్రవారం వారిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని పలు చోట్ల గురువారం అర్ధరాత్రి పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ టీంల సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా గుంపులుగా తిరుగుతున్న యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇళ్లకు పంపించారు. సీఐ మాట్లాడు తూ పట్టణంలో రోజు స్పెషల్ టీంతో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా గంజాయి, నిషేధిత పదార్థాలతో పట్టుబడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ఆర్ఎస్సైలు రాజశేఖర్ ,సాయి, రవి, స్పెషల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

'తక్షణం రిలీవ్ చేయండి'

తానూరు: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణరావ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా పాత పాఠశాలలో కొనసాగించడం సరికాదన్నారు. గతంలోనూ బదిలీ అయిన వారిని రిలీవ్ చేయకపోవడంతో వారు సీనియార్టీ కోల్పోతున్నారని పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

లక్ష్మణచాంద: తమకు ఐదు నెలలుగా రావాల్సిన వేతనాలు చెల్లించాలని మండలంలోని పంచాయతీ కార్మికులు ఎంపీడీవో రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు ఎంపీడీవోను వారి కార్యాలయంలో కలిశారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పంటల వివరాల నమోదు

కుంటాల: వానాకాలంలో రైతులు సాగు చేసే పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఈవో గణేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి.. సర్వేనంబర్‌తో వివరాలు నమోదు చేశారు. వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని ఏవో సోమలింగారెడ్డి తెలిపారు.

కడెం మండల ప్రత్యేకాధికారిగా డీఆర్డీవో



విజయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

కడెం: మండల ప్రత్యేకాధికారిగా డీఆర్డీవో విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన డీఆర్డీవోకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. వారిని ఎంపీడీవో అరుణ, సిబ్బంది వెంకటేశ్ తదితరులు సన్మానించారు.

ఖానాపూర్ ప్రత్యేకాధికారిగా బాబురావు

ఖానాపూర్: మండల పరిషత్ ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో శుక్రవారం మండల ప్రత్యేకాధికారిగా బాబురావు ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బాబురావుకు ఎంపీడీవో సునీత, కార్యాలయ సిబ్బంది మొక్క అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్, నర్సింహస్వామి, మదన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం పరిధిలోని పద్మావతినగర్ పంథా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడిమెట్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా కుందారపు రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా వేముల నాగరాజు, కోశాధికారిగా వెన్నం అంజయ్య, ప్రచార కార్యదర్శిగా నడిమెట్ల రాజేందర్ ఎన్నికయ్యారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా కంచారి రాంకిషన్, అధ్యక్షుడిగా భీమా చారి, ప్రధాన కార్యదర్శిగా గుండోజి రమేశ్, కోశాధికారిగా తాటికొండ శివకుమార్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సంఘం సభ్యులు కార్యవర్గాన్ని సత్కరించారు.

ఎకోక్లబ్‌లతో పర్యావరణ రక్షణ

- పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు
- జట్లుగా విభజించి విద్యార్థులకు అవగాహన



పర్యావరణ పరిరక్షణపై తాము గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు (ఫైల్)

మామడ: ప్రతి ఒక్కరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. సర్కారు బడుల్లోని విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే పర్యావరణంపై ఆసక్తి పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ నేషనల్ గ్రీన్ కోర్(ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో ఎకోక్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మూడేళ్ల కిందట వరకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌జీసీ కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.5వేలు మంజూరు చేసేది. నిధుల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని.. ఈ ఏడాది నుంచి మంజూరు కానున్నట్లు ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ మోహన్‌రావు తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నిర్వహణ ఇలా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 8,9వ తరగతి విద్యార్థులను జట్లుగా విభజించి పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఈ ఏకోక్లబ్‌ల ముఖ్యోద్దేశం. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాఠశాలలో విద్యార్థులను 5 రకాల జట్లుగా విభజిస్తారు. నీటి నిర్వహణ జట్టు, నేల నిర్వహణ, వైవిధ్య ప్రాణులు, జీవసంరక్షణ, శక్తి నిర్వహణ, వ్యర్థపదార్థాల నిర్వహణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులకు పోటీలు..

పాఠశాల ఆవరణలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, ఉపన్యాసం, వ్యాసరచన, కవిత రచన పోటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పాఠశాలలో వృథా చేస్తున్న విద్యుత్ శక్తిని గుర్తించడం, సౌరశక్తిపై అవగాహన పెంచుకోవడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడం గురించి వివరిస్తారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన పర్యావరణ దినోత్సవం, ఓజోన్ దినోత్సవం, అటవీ దినోత్సవాల సందర్భంగా పాఠశాలల్లో పలు రకాల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. పండుగలు మట్టి వినాయకుల తయారీ, బతుకమ్మ పండుగ వేడుకలను ఎన్‌జీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఎన్‌జీసీ ఆధ్వర్యంలో విద్యార్థులను జిల్లా స్థాయి క్యాంపులకు తీసుకెళ్లి పలు అంశాలపై అవగాహన కల్పిస్తారు.

ఇటీవల జిల్లాస్థాయి పోటీలు..

ఇటీవల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎకోక్లబ్ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణంపై పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించగా జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణం, పరిశుభ్రత అంశంపై విద్యార్థులు గీసిన చిత్రాలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ఈ పోటీల్లో నర్సాపూర్(జి) కేజీబీవీ విద్యార్థిని గాయిత్రి, సోన్ మండలం సిద్దులకుంట పాఠశాల విద్యార్థిని సంపద, నర్సాపూర్(జి) పాఠశాల విద్యార్థిని ఉదయ్‌కిరణ్ విజేతలుగా నిలిచారు.

ఆసక్తి పెరుగుతుంది



పాఠశాలల్లో ఎన్‌జీసీ కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థులకు పర్యావరణంపై ఆసక్తి పెరుగుతుంది. శక్తి వనరులను పొదుపుగా వాడుకోవడం, జీవాల పట్ల ఇష్టం, మొక్కలు నాటడం వంటి అంశాలపై అవగాహన కలుగుతుంది. పాఠశాలలో ఎకోక్లబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా జట్టుగా సాధించడం నేర్చుకుంటారు. ఐదు రకాల ఎకోక్లబ్‌లను ఏర్పాటు చేసి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– మోహన్‌రావు, ఎన్‌జీసీ, జిల్లా కోఆర్డినేటర్

అనర్థాలను వివరించా



జిల్లా కేంద్రంలో ఎన్‌జీసీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపకత అంశాలపై పోస్టర్‌మేకింగ్ పోటీలను నిర్వహించారు. చెట్లు కొట్టడం ద్వారా అడవులు అంతరించి కలిగే అనర్థాలను వివరించా. ఇందుకు గాను పోస్టర్ మేకింగ్‌లో ద్వితీయ బహుమతి వచ్చింది.

– సంపద, జెడ్పీహెచ్ఎస్, సిద్దులకుంట

ఉత్సాహంగా పాల్గొంటున్నాం



మా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్‌జీసీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. పర్యావరణం, పరిశుభ్రత అంశాలపై అవగాహన కలిగింది. ఉపాధ్యాయులు చెప్పిన మెలకువలతో జిల్లా స్థాయిలో బహుమతి గెలుపొందా.

– గాయిత్రి, నర్సాపూర్(జి) కేజీబీవీ

మోసపోతే 1930కు ఫిర్యాదు చేయాలి

- భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్



భైంసాలో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్, పక్కన సీఐ రాజారెడ్డి



సోన్: గంజాల్‌లో మాట్లాడుతున్న నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి

భైంసాటౌన్: ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయని..సైబర్ మోసాల బారిన పడితే పోలీస్‌స్టేషన్‌కు రాకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పులేనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 102 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, నాలుగు కార్లు, మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అపరిచితులు, అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజారెడ్డి, ఎస్సైలు షరీఫ్, ఎండీ గౌసుద్దీన్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సైబర్ మోసాల బారిన పడొద్దు

సోన్: సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గంజాల్ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత, గంజాయి, కల్తీకల్లుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సై గోపి, మోహినొద్దీన్, మల్లయ్య, నవీన్, గంగయ్య, ముత్తన్న, భాస్కర్, గ్రామస్తులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

నిర్మల్‌టౌన్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. వాహనదారులు విధిగా అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్లపై తప్పుగా రాసిన ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చెట్లతోనే మానవాళి మనుగడ



తానూరు: మొక్క నాటుతున్న ఏపీవో, సిబ్బంది

కుంటాల: చెట్లతోనే మానవాళికి మనుగడ ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల ఆదర్శ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, హరిత, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రధానోపాధ్యాయుడు దేవిదాస్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని మహాగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఎస్.కృష్ణ, నరేందర్‌రెడ్డి, హరీశ్, రాగిణి పాల్గొన్నారు.

తానూరు: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగన్‌గాంలో వనమహోత్సవం నిర్వహించగా ఆయన మొక్కలు నాటారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటించాలని సిబ్బందికి సూచించారు. టీఏ రమణగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని గ్రామ కార్యదర్శి వినయ్‌సాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటా మొక్కలు నాటించారు. గ్రామస్తులు ఉన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

లక్ష్మణచాంద: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని న్యాయవాది లింగాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావోపై కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా నూతన చట్టాలు, బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జెండర్ స్పెషలిస్ట్ మానిక, ప్రధానోపాధ్యాయులు అశోక్ వర్మ, న్యాయవాది డి.రమణాగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్లు పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద నిర్మించుకున్న రైతుల పశువుల షెడ్లను శుక్రవారం ఈజీఎస్ సిబ్బంది పరిశీలించారు. ఈసందర్భంగా టీఏలు దినేశ్, భీమ్ షెడ్ల కొలతల వివరాలను నమోదు చేసుకున్నారు. పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉంటే తమను సంప్రదించాలని వారు సూచించారు.

రెండు గ్రామాల సరిహద్దుపై వివాదం

- సర్వే చేసి పరిష్కారం చూపిన అధికారులు

నిర్మల్‌రూరల్: రెండు గ్రామాల సరిహద్దులపై వివాదం చెలరేగడంతో ల్యాండ్ సర్వే అధికారులు సర్వే చేసి పరిష్కారం చూపిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. నిర్మల్‌రూరల్ పోలీసులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం.. ఈనెల 7న ఆదివారం జరిగే బోనాల పండుగ కోసం నిర్మల్‌రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామస్తులు గ్రామ శివారులో ఓ గద్దెను ఏర్పాటు చేశారు. అయితే గద్దె ఏర్పాటు చేసిన ప్రాంతం మా పరిధిలోకి వస్తుందంటూ లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామస్తులు అడ్డు చెప్పడంతో వివాదం మొదలైంది. ఈ విషయం తెలుసుకున్న రూరల్ తహసీల్దార్ సంతోష్, రూరల్ ఎస్సై సాయికుమార్ అక్కడకు వెళ్లి ఇరు గ్రామాల వీడీసీ సభ్యులతో చర్చించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్ అభిలాష అభినవ్ వద్దకు వెళ్లి ఇరు గ్రామాల ప్రజలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. కలెక్టర్ స్పందించి వెంటనే సర్వే చేయాలని ల్యాండ్ సర్వే అధికారులను ఆదేశించారు. దీంతో ఏడీ సుదర్శన్ ఘటనా స్థలానికి వెళ్లి సర్వే చేశారు. రత్నాపూర్ కాండ్లీ గ్రామస్తులు ఏర్పాటు చేసిన గద్దె ప్రాంతం ఆ ఊరి వాళ్లదేనని తేల్చారు. దీంతో కనకాపూర్ గ్రామస్తులు, వీడీసీ సభ్యులు వెనుదిరిగారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ప్రజాప్రతినిధులకు సన్మానం

దిలావర్‌పూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానించారు. మండల పరిషత్, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, మాజీ జెడ్పీటీసీ రమణారెడ్డి, ఎంపీటీసీలతోపాటు కోఆప్షన్ సభ్యుడిని సన్మానించారు. తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ అరుణారాణి, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఏపీఓ దివ్యారెడ్డి, అధికారులు, కార్యదర్శులు మాజీ సర్పంచ్ జంగం వీరేశ్, నాయకులు పాల్గొన్నారు. ఎంపీపీని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సిర్గాపూర్ పంచాయతీలో ఎంపీటీసీ ఏలేటి రవీందర్‌రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు.

తానూరు: మండలంలోని మొగ్లి ఎంపీటీసీ లక్ష్మణ్ పదవీకాలం ఇటీవల పూర్తవగా శుక్రవారం గ్రామ కమిటీ సభ్యులు ,గ్రామస్తులు సన్మానించారు.

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మోహన్‌కుమార్ తెలిపారు. తానూర్ 33 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఆటోనగర్, బాసర రోడ్, మాంజ్రి రోడ్డు, పడిగెల ఫ్యాక్టరీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెంపుడు జంతువులకు టీకాలు

భైంసాటౌన్: కిసాన్‌గల్లీలోని పశువైద్యశాలలో శనివారం పెంపుడు జంతువులకు టీకాలు వేయనున్నట్లు భైంసా మండల పశు వైద్యాధికారి విఠల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న జునోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులకు టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అమ్మ పేరిట మొక్క నాటండి



మొక్కలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

నిర్మల్‌ఖిల్లాగేట్: చెట్లతోనే మానవాళి మనుగడ సాధ్యమని.. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట మొక్క నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్ రెడ్డి అన్నారు. అమ్మ పేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు విధిగా గ్రామాల్లో మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, నాయకులు ఆడెపు సుధాకర్, మల్లేశ్ పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వారోత్సవాలు

భైంసారూరల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని చుచుంద్ గ్రామంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు. గ్రామ బూత్ అధ్యక్షులు శివయాదవ్, గణేశ్, నాయకులు అశోక్, సాయినాథ్, రాజేశ్వర్‌పటేల్, నాగేశ్‌పటేల్, సుధాకర్, ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు నివాళి



మౌనం పాటిస్తున్న ఎలగడప గ్రామస్తులు

కడెం: మండలంలోని ఎలగడప గ్రామంలో శుక్రవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ చిత్రపటానికి గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా వారు చేసిన సేవలను గుర్తు చేసుకొని మౌనం పాటించారు. కార్యక్రమంలో రాపర్తి శ్రీనివాస్, శంకర్, భూమారాజం, రవి, శ్రీనివాస్, గంగన్న, రాజేందర్, ప్రసాద్, భూపతి తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్సైకి మొక్క అందిస్తున్న నాయకులు

సోన్: నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గోపిని శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పూలమొక్క అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మోహినొద్దీన్, వినోద్, సాయన్న, గంగారెడ్డి, గడ్డం స్వామి, బొడ్డు లస్మన్న, ఇలసరం లింగన్న, కాంతయ్య, రాజేశ్వర్, అంబేకర్ ప్రసాద్, మేక నరేశ్, అర్జున్‌లింగన్న, నర్సయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



11వ వార్డులో పరిశీలిస్తున్న చైర్మన్ సత్యం



హల్దాలో పరిశీలిస్తున్న అధికారి మనోహర్

ఖానాపూర్: రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శుక్రవారం డ్రై డేను పురస్కరించుకొని పలు కాలనీల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఐదో వార్డులో పొక్లెయిన్‌తో పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టగా చైర్మన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోశ్, పరిమి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చూసుకోవాలి

సారంగపూర్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని వైద్యాధికారి వేదవ్యాస్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పలు కాలనీల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, వైద్యసిబ్బంది పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టైర్లు, కొబ్బరిబోండాలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. నిల్వ నీటితో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కారోబారి ఉమామహేశ్వర్ ఉన్నారు.

కుభీర్: మండలంలోని పార్డి(బి), వీర్‌గాం, హల్దా గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను మండల ప్రత్యేకాధికారి మనోహర్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హల్దాలో మొక్కలు నాటారు. ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు కమల్‌సింగ్, మహేందర్‌సింగ్ అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నిర్మల్‌ఖిల్లాగేట్: ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టరేట్ ఏవో సూర్యరావుకు జర్నలిస్టులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతూ అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. శ్రీనివాస్‌చారి, వెంకగారి భూమయ్య, గుమ్ముల అశోక్, హనుమాండ్లు, మనోజ్, రాజేశ్వర్, రాజు, గంగరాజు, శేషగిరి ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



పండరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావ్‌పటేల్

ముధోల్ : ముధోల్, బాసర మండలాల్లోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణ, ఎంపీడీవో రాములు నాయక్, ఏపీవో శిరీష, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీలు భూమేశ్, లక్ష్మీ నారాయణ, నాయకులు తాటివార్ రమేశ్, సతీశ్‌రెడ్డి, దశరథ్, ధర్మపురి శ్రీనివాస్, మోహన్‌యాదవ్‌తదితరులున్నారు.

సేవకులను గుర్తించడం అభినందనీయం

భైంసాటౌన్: సమాజ సేవకులను గుర్తించి డాక్టరేట్‌తో సన్మానించడం అభినందనీయమని ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ అన్నారు. కుభీర్ మండలానికి చెందిన సమాజ సేవకుడు, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్ సాప పండరికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ(బెంగళూరు) ఇటీవల డాక్టరేట్ పట్టాతో సన్మానించింది. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను శాలువాతో సన్మానించారు. మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, శ్రీనివాస్, రాజేశ్వర్, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఫోన్ అప్పగింత

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామానికి చెందిన పద్మ ఆలయంలో తన ఫోన్‌ను పోగొట్టుకుంది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న వాగ్దేవి సొసైటీ సిబ్బంది ప్రకాశ్, అశోక్ గమనించి భక్తురాలకు ఫోన్ అందజేశారు.